ఆదివారం

ప్రజాశక్తి

అక్టోబర్ 13, 2002

కోరలు చాస్తున్న నేర జగత్తు

హ్యాపీ బర్త్‌డే

(13-10-2002 నుండి 19-10-2002 వరకు)

టి. శ్రావణ్ కుమార్
2 సం॥, 13-10-2000
టి.రమాదేవి, వెంకటరమణ మదనపల్లి, చిత్తూరు జిల్లా

టి. మనోజ్
1 సం॥, 13-10-2001
టి. రత్నం, టి. ప్రసాద్ మహారాణిపేట్, వైజాగ్.

ఎ. సత్యరామారావు (బాబి)
6 సం॥, 18-10-1996
వినయ, శివశంకరప్రసాద్, పెసమిల్లు, కృష్ణాజిల్లా

జి.వి.రామన్
2 సం॥, 14-10-2000
రజిత, మోహన్, వైరా, ఖమ్మం

మదన్ సాయిగౌడ్
1 సం॥, 14-10-2001
హరిత, అనిల్ గౌడ్, పానగల్, నల్గొండ.

సనపల ప్రమోద్
1 సం॥, 14-10-2001
నాగవేణి, జగన్నాథరావు బిహెచ్‌పివి, విశాఖపట్టణం

ఎస్. హైమావతి
7 సం॥, 14-10-1995
ఎస్. నాగవేణి, గంగులప్ప, తంబళ్ళపల్లె, చిత్తూరు

జి. సంకీర్తన
5 సం॥, 14-10-1997
గుండు కోకిల, అంజయ్యగౌడ్, మునగాల, నల్లగొండ.

ఎం. దుర్గ అఖిల్
7 సం॥, 16-10-1995
ఎం.ధనకుమారి, సూర్య నారాయణ, విశాఖ.

దొడ్లా హేమసుందర్
7 సం॥, 17-10-1995
డి. చంద్రకళ, వెంకటేశ్వరరావు,
నరసరావుపేట, గుంటూరు.

కె. తేజస్వి
9 సం॥, 17-10-1993
కె. నాగమణి, సత్యనారాయణ,
విశాఖపట్నం

ఎం. అమల
9 సం॥, 17-10-1993
ఎం. కౌసల్య, రామచంద్ర
అంబర్‌పేట, రంగారెడ్డి.

బి. భార్గవి
4 సం॥, 19-10-1998
బి. ప్రభ, మురళి,
వెంగన్నపాలెం, ఖమ్మం.

ఆర్ట్ గ్యాలరీ

క్విజ్-26

1. 'అభిజ్ఞాన శాకుంతలం' రచించినదెవరు?
ఎ. భవభూతి బి. కాళిదాసు
2. 'ఎ' విటమిన్ సమృద్ధిగా ఎందులో వుంది?
ఎ. క్యారెట్ బి. యాపిల్
3. హోమియోపతి వైద్యాన్ని ఎవరు కనుగొన్నారు?
ఎ. హానిమన్ బి. చరకుడు
4. కంగారూల భూమి (లాండ్ ఆఫ్ కంగారూస్) అని ఏ దేశాన్ని పిలుస్తారు ?
ఎ.ఆస్ట్రేలియా బి.థాయ్‌లాండ్
5. 'తాలిబన్' అనే పదంతో సంబంధమున్న దేశం?
ఎ. ఇరాన్ బి. ఆఫ్ఘనిస్తాన్
6. 'క్యాట్' అనునది ఏ దేశపు కరెన్సీ?
ఎ. ఇండొనేషియా బి. మయన్మార్
7. కలర్ టీవీలలో వుండే ప్రాథమిక రంగులు ఏవి?
ఎ.ఎరుపు, నలుపు, ఆకుపచ్చ బి. ఆకుపచ్చ, నీలం, ఎరుపు
8. 'జైహింద్' అనే నినాదాన్ని మొదటిసారిగా ఇచ్చిన వ్యక్తి?
ఎ.సుభాష్ చంద్రబోస్ బి. బిపిన్ చంద్రపాల్
9. ఎలక్ట్రిక్ బల్బులో ఉపయోగించే వాయువు?
ఎ. ఆర్గాన్ బి. ఆక్సిజన్
10. పక్క ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ. ఎస్.ఎమ్.కృష్ణ బి. కరుణానిధి

కార్బన్ పేపర్ కథ

ఫ్రెండ్స్....

మీకు కార్బన్ పేపర్ తెలుసుకదా. అదే... మనం
రాయదలచుకున్న విషయాన్ని ఒకేసారి ఎన్ని కాపీలైనా
తీసుకునే వీలుంటుంది. షాపుల్లో నీలం, నలుపు రంగుల్లో
లభిస్తుంది.... గుర్తొచ్చిందా?
సరే... ఈ కార్బన్ పేపరును ఎవరు
ఎలా కనిపెట్టారో చూద్దామా?
రాల్ఫ్ వెడ్జ్‌వుడ్ అనే బ్రిటిష్
వ్యక్తికి తను రాసిన దానిని
...దేసి కాపీలు చేయడం చాలా
...ష్టం గా వుండేది. అసలు
...క విషయాన్ని పది సార్లు
రాయడమెందుకు?



...కసారి రాస్తే పది కాపీలు వచ్చే
...లభమైన పద్ధతి ఏమైనా వుందా? అని బాగా
...లోచించాడు. ఒక కాగితాన్ని తీసుకున్నాడు. సిరాతో తడిపి
...టింగ్ పేపరు మీద పెట్టి అంటించాడు. తరువాత ఆ సిరా
...గితాన్ని రెండు కాగితాల మధ్య పెట్టి రాస్తే నకలు దిగింది.
...ా వెడ్జ్‌వుడ్ 1806వ సంవత్సరంలో కార్బన్ పేపర్
...పెట్టాడు. ఇది చూసేందుకు సింపుల్‌గా వున్నా
...పెట్టడానికి చాలా కాలం పట్టింది. ఫ్రెండ్స్ ఇదీ కార్బన్
...ర్ కథ.

-కుంజా సంతోష్‌కుమార్, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్,
భద్రాచలం, ఖమ్మం.

నేతి మిఠాయి వాసన

'ఆ చెప్పండి... మీయిద్దరి మధ్య ఏమిటి గొడవ...' అనడిగాడు నసీరుద్దీన్ తన ఎదురుగా నిలబడిన ఇద్దరు వ్యక్తులవైపు చూస్తూ.

'నేను మిఠాయి వ్యాపారినండీ... ఈ రోజు ఇతగాడు నా అంగడి ముందు నిలబడి నా నేతి మిఠాయిల వాసనంతా పీల్చుకున్నాడండీ. వాసన పీల్చుకోవడమంటే మిఠాయిలు తిన్నట్టేకదా. అందుకే డబ్బిమ్మంటే... ఇవ్వను పొమ్మంటున్నాడండీ. ఇదేం న్యాయం చెప్పండి' అన్నాడు మొదటి వ్యక్తి.

'అయ్యా నసీరుద్దీన్‌గారూ... ఆ వీధిన వెళుతూ పొరపాటున ఆయనగారి మిఠాయిల వాసన పీల్చుకున్నాను. ఆ మాత్రానికే ఖరీదు ఇమ్మంటే ఎలాగండీ... అంత స్తోమతు వుంటే మిఠాయిలే కొనుక్కునేవాడినికదా. మీరే న్యాయం చెప్పాలి' అన్నాడు రెండవ వ్యక్తి.

ఇద్దరి మాటలు విన్నాక నసీరుద్దీన్ రెండు నిముషాలు ఆలోచించాడు. ఓ చిన్న సంచీలో నాణాలు వేసి రెండవ వ్యక్తికిచ్చి మోగించమన్నాడు. అతగాడు అదే విధంగా చేశాడు. అప్పుడు నసీరుద్దీన్ మిఠాయి వ్యాపారివైపు తిరిగి 'వినిపించిందా నాణాల మోత' అనడిగాడు. అతను ఔనన్నాడు. 'ఐతే ఇక వెళ్లు' అన్నాడు నసీరుద్దీన్. 'ఇదేంటి నాణాల మోత వింటే డబ్బులు ఇచ్చేసినట్టేనా?' అన్నాడు వ్యాపారి. 'అవును మరి మిఠాయి వాసన చూస్తే తిన్నట్టేనన్నావుకదా. ఇదీ అంతే' అన్నాడు నసీరుద్దీన్. అంతే వ్యాపారి మారు మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

దేవుళ్ళే నా ప్రజలు



రుక్మిణి

ఆ దినం గుడి చాలా ఆర్భాటంగా వుంది. భక్తులూ... భజనకారులో కానీ - మొత్తం జనంతో కలకలలాడి పోతుంది. గుంపు! సందట్లో సడేమియాలా బయట అరుగుల మీద పెద్ద బిచ్చగాళ్ళ గుంపు చేతులూపుకుంటూ... గుడ్లు మిటకరిస్తూ చేరిపోయారు.

"ఏందిర యాద్గిరీ... ఇవాళేమన్న పండగ్గాని వుందార! ఒకటే జనం... గుడికి వచ్చి పడతన్నారు." జక్కులోడు చాలా ఆశ్చర్యంగా నోరెళ్ళబెట్టి అడిగాడు. యాద్గిరి బీడీ దమ్ము పీకి, చప్టామీద కూలబడి సాలోచనగా తల పంకించాడు. వాడికీ సంగతి అర్థం గాదాయె!

"ఒరే... ఒరే... మన పచ్చబాబుగారు... పెండ్లాంగారితో వచ్చి పూజలకు తగులుకున్నాడు - అబ్బో... అవేం పూజలోగాని... ఇప్పటికి నాలుగ్గంటలాయె! మూసిన కన్ను మరి తెరవకుండా ఒకటే జపం! పూజ... నిష్ట"!

యాద్గిరి నోట్లో నుండి బీడీ దానంతటదే జారివడిపోయింది! ప్రపంచం మొత్తం గాకున్నా ఆ ప్రాంతం వరకు మాత్రం అదో గొప్ప సంఘటనే మరి! ఎందుకంటే పచ్చబాబువి రకరకాల పథకాలు... చిన్నా పెద్దా కాంట్రాక్టులు... పైరవీలు... చోటామోటా గవర్మెంటు కంపెనీలన్నీ అమ్మీ... కొనీ... లీజులకివ్వడం... అదే ఆయనగారి పని! గవర్నమెంటుకు ఆయన ఎంత చెబితే అంత... అసలు ఆట ఆడేదీ... ఆడించేదీ బాబుగారే! ఆయనగారి వంశంలోని వాళ్ళందరికీ ప్రజలంటే ప్రేమంటారు.. బాబుగారు చాలాసార్లు 'ప్రజలే నా దేవుళ్ళు'.. దేవుళ్ళు మరెక్కడో లేరు. అందుకే వాళ్ళ కోసం రెండ్రోజుల కోసారి నా ప్రాణాలిచ్చినా నాకొచ్చే ఇబ్బందేం లేదూ... అట్లా ఇస్తుండాలి కూడా..." అని గాండ్రించి, రొమ్ము బాదుకుని అందరికీ తెలియజేసుకుంటాడు - లోపాయికారీ మనుషులు ఉపాయంగా ఆరాలు తీస్తే "అంతేగద! వాండ్లే నా దేవుళ్ళు... మరి ఓట్లు వుంది వీళ్ళకేనాయె.. వీళ్ళు వేస్తేనే గద గెలిచేది... మరి ఈ గుళ్ళో దేవుళ్ళు ఏనాడైనా పోలింగు కేంద్రానికి వచ్చి చచ్చారా... క్యూగట్టారా... వేస్ట్... ప్రజలే నా దేవుళ్ళు... లానాదేనా వాండ్లు వేసే ఓట్లే నా వరాల డబ్బాలు... మూటలు... బాటలు..."

ఈ తత్వం చాలా మందికి జీర్ణమైపోయి కాలువ పారినట్టు కిందిదాకా పాకింది - అందుకే ఎవడ్ని కదిలించినా ఈ పాటనే తగులుకుని తనకు అందుబాటైన రాగంలో... శృతిలో అందుకోవడంతో అందరూ బెంబేలెత్తిపోయారు!

"ఓర్నీ... మరి గీ ప్రజలందరూ దేవుళ్ళయితే-మరి గీ గుళ్ళూ... గోపురాలూ.. ఎందుకంటా? అందుట్లో వున్న దేవుళ్ళకు పూజలు చేసి రోజూ టెంకాయలు ఎవడెందుకు కొట్టాలని" కొందరు మటమటలాడిన వారు వుండినా అది వేరు సంగతి!

అపుడు మాత్రం బాబుగారి పటాటోపంతో ఆ గుడంతా దద్దరిల్లి పోతుంది!

"అరె అన్నా...! ఆ పెద్దచింత కింద ఆ గ్యాంగెవర్రా... బవిరి బరుసు గెడ్డా లేసుకుని.... తలలకు కాషాయం ముసుగులు... అబ్బో... వాండ్లు పులిజూదాలు... అచ్చన గిల్లలు ఆడుకుంటుండ్రు.. భక్తులైతే గుళ్ళో జొరబడాల్నాయె!"

యాద్గిరి బుర్ర తిరిగిపోయింది. బిచ్చగాళ్ళ గుంపులో కలకలం చెలరేగింది. ఒకళ్లిద్దరు ఒళ్ళు మండి బూతులకు తగులుకుంటున్నారు. వాళ్ళలో వాళ్ళే తిట్టుకుంటున్నారు. బాబుగారు పూజాదికాలు ముగించి, కండ్లు నగం మూసుకుని, భక్తి పారవశ్యంతో బయటకు వచ్చీ రాగానే, బిచ్చగాండ్ల గుంపంతా చుట్టుముట్టి కేకలకు తగులుకున్నారు. యాద్గిరి, జక్కులోడు చప్టామీద నుండే అవాక్కై అంతా చూస్తున్నారు.

"ఎవరయ్యా మీరు? హాయిగా ధ్యానం చేయండి! మీరంతా పాజిటివ్‌గా ఆలోచించడం నేర్చుకుంటే మీకే కష్టాలూ వుండవు.. ఆందోళన వద్దనుకుంటే ఆసనాలు చేయాలి మరి... తప్పదు!"

బిచ్చగాండ్లు భీతిల్లినారు. "ఆసనాలా..? ఉపాసాల దెబ్బకే ఉల్టాపల్టా అయిపోతుంటే... ఆసనాలు! ఓరితండ్రో... అయ్యా బాబూ! సాగర్ కాలువ కింది రైతులం... తమరి దయవల్ల ఇట్లా బొచ్చెలుచ్చుకుని ఉపవాసాలో, ఉరితాళ్ళో... తేల్చుకోవాలని తిరుగుతున్నాం...!"

"అంతా దేవుడి దయ... మన చేతులో ఏం లేదు...'ఆయన కటాక్షిస్తేనే వానలు.."

"వానలొచ్చేదీ వరాలిచ్చేదీ...

ఆ కంప్యూటరు పెట్టుకుని వచ్చే పాతిక సంవత్సరాలకు విజన్ 2020 అని ప్లాను తయారు చేస్తిరి... నెత్రోజుల్లో వచ్చే వానల సంగతి తెల్వదా? తెల్వకుండనే మమ్మల్ని నాట్లేసుకొమ్మని నీళ్ళిడిసిండ్రా?" కీసర బాసరగా కేకలు పెట్టారు.. "మరి మా బోరుబావులు... వాటికి నీళ్ళందక యాతనాయె! ఇంకుడు గుంతలు... తొక్కుడు బిల్లలని వేలకోట్లు ఖర్చు చేసి - అయిదారు మీటర్ల భూమిల నీటి మట్టం పెరిగిందని తొడలు జరిసి సవాల్లు జేస్తిరి!"

"చెప్తున్నా గదా! దేవుడు దయ తలచలేదు.. దేవుడు వానలు కురిపిస్తే భూగర్భ జలాలు పెరిగేవి. పంటలు పండేవి...!"

రైతు బిచ్చగాళ్ళందరూ హాహాకారాలు చేశారు.' అంతా ఆ దేవుడి దయే' అయినపుడు మరి ఆ దేవుడే సరిపోడా? మన మంత్రిగారూ... మంత్రాంగం ఎందుకటా? ఆ భజనలూ అవీ రోజూ తాము మిడకగలమే!

ఈ సందట్లో పులిజూదాలు... గెడ్డాల వాండ్లు తక్కుతూ - తారుతూ దొంగబిత్తర చూపులు చూసుకుంటూ జాగ్రత్తగా వచ్చిపడ్డారు. రాంగానే 'కరంటు' దౌర్జన్యం నశించాలీ... 'కరంటు డౌన్... డౌన్..' 'ట్రాన్స్కొ ముర్దాబాద్' అని అరిచేసరికి అందరూ అదిరిపోయారు - బాబుగారు బిత్తరపోయి చూసేంతలో ఒకడు ముందుకువచ్చి సున్నితంగా తాను అతికించుకున్న బవిరిగెడ్డం - గుబురు మీసం పీకేసరికి అందరూ తెల్లబోయారు.

"యహె... మారేసాలేసుకుని తిరుగుతున్నం! అందరం..!"

"అదేంటి? వీధినాటకాలా?"

"మీ బాగోతం దెబ్బ... కరంటు లోవోల్టేజీ... హైటెక్కు దెబ్బకు దినాం మోటార్లు కాలిపాయె - పైసల్లేవాయె... బిల్లులు కట్టకపోతే జైల్ల నూకుతమని కరంటోల్లు... టోటల్... వోల్.. మా ఫ్యామిలీస్‌నందర్నీ పట్కపోయింద్రు - ఇంగమేం బాబుగారిని కలవడానికి మీసం ఏసం గట్ట గిటుపడినంగాదు!"

"దేవుడే దేవుడు! వానలు దేవుడు కురిపిస్తే కరంటు బాగుంటది! అందరూ దేవుడ్నే నమ్ముకోండి! నేను నిమిత్త మాత్రుడ్ని?"

వాళ్ళందరూ విరుచుకు పడినంత పని చేశారు.

"ఒరే యాద్గిరీ... గీమాట చాలాబాగుంది గాదుర.. మరి రేపు ప్రపంచ బ్యాంకోడు వాడిచ్చిన యాభైవేల కోట్ల రూపాయల అసలు ఫాయిదాలడిగితే ఎట్లా...?"

"దేవుళ్ళే నా ప్రజలు... ఇంతకాలం ప్రజల్ని చూపించి ఆటలాడాం! 'ఇంగపోయి ఆ దేవుడ్ని చూసుకోమంటాడు - ఒరే... దేవుడు ఒకడుకాదు - మనకు ముక్కోటి దేవతలు... అందరు దేవుళ్ళూ ప్రజలే! ఆళ్ళంతా ఓట్లేస్తే ఇంకా కావల్సిందే ముంది?" అన్నాడు యాద్గిరి! ★

కబడ్డీ 'స్వర్ణం' గ్రామీణ క్రీడలకు ఊతం

మారేపల్లి లక్ష్మణ్

కబడ్డీలో భారత్ వరుసగా నాల్గవసారి ఆసియాడ్ స్వర్ణం సాధించడంతో గ్రామీణ క్రీడలకు ఊతం ఇచ్చినట్లయింది. ఆసియాడ్‌లో భారత్ స్వర్ణం కచ్చితంగా సాధించే క్రీడ కబడ్డీనే అన్నంతగా ఎదిగింది. గ్రామీణ క్రీడైన కబడ్డీ 1990 బీజింగ్ ఆసియాడ్‌లో రంగప్రవేశం చేస్తూనే భారత్ పరువు కాపాడింది. ఆ ఆసియాడ్‌లో భారత్ గెలుపొందిన ఏకైక స్వర్ణం కబడ్డీదే. బీజింగ్ ఆసియాడ్ తర్వాత 1994 హిరోషిమా, 1998 బ్యాంకాక్ ఆసియాడ్ స్వర్ణాలు కూడా తన ఖాతాలో జమచేసుకుంది. బుసాన్‌లోనూ చరిత్ర పునరావృతం చేసింది. మిగిలిన గ్రామీణ క్రీడలుగా పరిగణించే వాలీబాల్, విలువిద్య, కుస్తీ పోటీల్లో భారత్ విఫలం తర్వాత కబడ్డీలో లభించిన ఈ విజయం దేశంలో గ్రామీణ క్రీడల అభివృద్ధికి తోడ్పాటు నందించినట్లే. గ్రామీణ క్రీడలను చిన్నచూపు చూసే ప్రభుత్వాలు ఇకనైనా మేల్కొనాల్సిన ఆవశ్యకతను కల్పించింది. ఒలింపిక్స్‌లో స్వర్ణానికి మొఖం వాచిన భారత్‌కు ఆ క్రీడల్లో కబడ్డీని చేరిస్తే ఆ చిరకాల స్వప్నం తీరగలదేమో. ఇపుడు "స్వర్ణం వస్తే సంతోషించడం కాదు - రాకపోతేనే ఆశ్చర్యపోవాలి" అన్నంతగా కబడ్డీ పేరు తెచ్చుకుంది.

బుసాన్ ఆసియాడ్‌లో భారత్ ప్రారంభంనుండే ప్రత్యర్థులను హడలెత్తించింది. ప్రారంభ మ్యాచ్‌లో మలేసియాపై 47-21తో గెలుపొందిన భారత్ తరువాతి మ్యాచ్‌లో జపాన్‌ను 53-21తో ఓడించి స్వర్ణం దిశగా అడుగు వేసింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి గట్టి పోటీ ఎదురవ్వగలదన్న పరిశీలకుల అంచనాలను భారత రైడర్లు తలక్రిందులు చేశారు. భారత్ జట్టు బంగ్లాదేశ్‌ను 37-14 పాయింట్లతో, చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 37-7 పాయింట్లతో విజయం సాధించి వాటిని కోలుకోకుండా చేసింది. ఈ మ్యాచ్‌ల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకు ఒక్క లోనా పాయింట్ కూడా ఇవ్వకుండా చిత్తు చేసింది. రైడింగ్‌కు వెళ్లిన ప్రతిసారీ భారత రైడర్లు పాయింట్లు సాధించారు. డిఫెన్స్ కూడా దుర్భేద్యంగా వుంది. కలిసికట్టు వ్యూహంతో కోర్టులోకి అడుగుపెట్టిన ప్రత్యర్థి రౌడరన్‌ను ఉచ్చులో బిగించారు. భారత రైడర్లు రమేష్‌సింగ్, కబడ్డీ కింగ్ జగదీష్, దినేష్‌కుమార్ అత్యుత్తమ ఆటను ప్రదర్శించారు. వీరికి ఈ టోర్నీ మొత్తంలో తిరుగేలేకుండా పోయింది. ఎక్కువగా నేలపైనే ఆడటానికి అలవాటు పడ్డ భారత క్రీడాకారులకు సింథటిక్ టర్ఫ్‌పై ఆడటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే నియమ నిబంధనల్లో మార్పులు కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం వున్నా వారు దిగ్విజయంగా అధిగమించారు.

ఒలింపిక్ క్రీడల్లో స్థానం పొందనప్పటికీ కబడ్డీకి భారత గ్రామీణ ప్రాంతంలో విశేష ఆదరణ వుంది. ప్రతి పల్లెలో యువకులు ఎంతో ఉత్సాహంతో ఈ క్రీడలను ఆడడం జరుగుతుంది. ఎలాంటి క్రీడా పరికరాల అవసరం కాని, సౌకర్యాలూ సదుపాయాలు అవసరం లేని ఒకే ఒక్క క్రీడ కబడ్డీ. అవుట్‌డోర్‌లో మట్టి మైదానాలపై ఆడే ఈ క్రీడలో కూడా ఆధునికత చోటు చేసుకుంటున్నది. అవుట్‌డోర్ క్రీడైన కబడ్డీ ఇపుడు ఇండోర్ క్రీడగా రూపాంతరం చెందింది. మట్టి కోర్టుల స్థానే సింథటిక్ టర్ఫ్ కోర్టులు ప్రవేశించాయి. నియమ నిబంధనలలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఎందుకంటే దేశవాళీ పోటీల్లో బోనస్ లైన్‌ను తాకితే పాయింటు కేటాయిస్తారు. కాని ఇపుడు అలా కాదు. పాయింటు సాధించాలంటే చివరి(ఎండ్) లైన్‌ను తాకాల్సిందే. ప్రత్యర్థి కోర్టులోని ఆటగాళ్లను అందరినీ మైదానం బయటికి పంపిస్తే లోనాను రూపంలో బోనస్ పాయింట్లను కేటాయిస్తారు.

నేర్పరి తనానికి, బుద్ధి కుశలతకు, కండపుష్టికి ఎక్కువ ప్రాధాన్యం గల ఈ కబడ్డీ ఇపుడు జపాన్, మలేసియా, కొరియా, బ్రిటన్‌లలో ఆదరణ చూరగొంటున్నది. మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో ఇప్పటికే మంచి ఆదరణ వుంది. ఈ జట్లు భారత్‌కు గట్టి ప్రత్యర్థులుగా రూపొందాయి. భారత్ క్లబ్ జట్లు, బంగ్లాదేశ్, పాకిస్తాన్, సింగపూర్‌లోని అగ్రశ్రేణి జట్లు లండన్‌లో ఏడాదికి రెండుసార్లు ఇండోర్ టోర్నమెంట్లలో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాయి. లండన్‌లోనూ కబడ్డీ మంచి ఆదరణను చూరగొంటోంది. పాక్, బంగ్లాదేశ్ జట్లు బాగా మెరుగుపడ్డాయి. భారత్‌కు కొద్దోగొప్పో పోటీనిచ్చే స్థాయికి బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక, మలేసియా, కొరియాలు ఎదిగాయి. చైనా, జపాన్, కొరియాలు, అరబ్ దేశాల జట్లు ఒకప్పుడు నామమాత్రంగానే పోటీపడేవి. ఇపుడు అవి ఎంతో మెరుగయ్యాయి. ముఖ్యంగా అరబ్ జట్లు భారత్‌కు చెందిన వారిని కోచ్‌లుగా నియమించుకోవడం ద్వారా ఈ దేశాలు ఆటలోని మెళకువలను అవగతం చేసుకుంటున్నాయి. ★

వెన్నెల చీర

బింగి సత్యనారాయణ

తెలుగు సంవత్సరాది. గుమ్మాలకు కట్టిన పచ్చని తోరణాలు కళకళలాడుతున్నాయి. అటుఇటు కేరింతలతో తిరుగాడుతున్న సుబ్బారావు మనుమలు, మనుమరాళ్ల అల్లరితో ఇల్లంతా కోలాహలంగా ఉంది. సుబ్బారావు, అన్నపూర్ణమ్మ దంపతుల మనసుల్లో పోయిన పండుగలకు లేని ఆనందం చోటు చేసుకుంది. ఈ సంతోషానికి కారణం లేకపోలేదు. ఎప్పుడూ బిజినెస్‌లూ, ఉద్యోగాలంటూ నాలుగు దిక్కుల్లో బిజీగా ఉండే కూతుళ్ళూ, అల్లుళ్లూ పండుగ సందర్భాలలో, వారింట్లో ఇలా కలవటం అరుదుగా జరిగేది. ఈసారి ఇలా కలవటానికి చెప్పుకోదగ్గ విశేషముంది. సుబ్బారావు నలుగురు కూతుళ్ల తరువాత చివరగా పుట్టిన ఏకైక పుత్రరత్నం చందుకు ఐదు రోజుల క్రితం పెళ్ళి జరిగింది. నిన్న ఉదయమే వెళ్ళాలని కుటుంబాలతో రెడీ అయిన అల్లుళ్లను అత్తమామలు పండగకుండాల్సిందని ప్రాధేయపడటంతో ఉండిపోయారు. ఉదయాన్నే అందరూ లేచి, తలస్నానాలు చేసి ఎవరి పనుల్లో వారు నిమగ్నులయ్యారు.

"ఏయ్ పిల్లా! అయిపోయిందా, నీ ముగ్గులేయటం" అంది రాధ కొంటెగా ముంగిట్లోకి వస్తూ.

"అయిపోవచ్చిందొదినా! ఈ ఒక్క రంగు నింపితే అయిపోయినట్టే!" అంది వెన్నెల తల ఎత్తి అరనవ్వుతో.

"ఫర్వాలేదే, బాగా వేశావు! ముగ్గులు వేయటంలో ఎక్స్‌పర్ట్‌నని నిరూపించుకున్నావు. ఎక్కడ నేర్చుకున్నావేంటి?' అంది వెన్నెల పక్కన ముంగాళ్లపై కూర్చుంటూ.

"మా అమ్మదగ్గరే!"

"వెన్నెలా! నీతో ఓ నిజం చెప్పనా!"

"చెప్పొదినా!"

"ఈ ముగ్గుని చూస్తుంటే, నీ అందమే కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే నీ అంత అందంగా ఉంది"! అంది రాధ కనులతోనే మెచ్చుకుంటూ. వదిన మాటలకు వెన్నెల కాస్త సిగ్గు పడింది. ఇంతలో రాధకొడుకు బాబిగాడొచ్చి అమ్మమ్మ నిన్ను పిలుచుకురమ్మందంటూ ఆమెను వెంటబెట్టుకు పోయాడు.

ముగ్గు వేయటం పూర్తి కావటంతో లేచి జారిన చెంగుని దోపుకుని కాస్త నిట్టూర్చి ముగ్గు గిన్నెతో తనూ లోనికెళ్లింది.

ట్రింగ్.. ట్రింగ్...

వెన్నెల చేస్తున్న వంటను విడిచి గబగబా వెళ్ళి రిసీవర్ అందుకుంది.

"హలో...! కాదండీ! అయినా సరిగ్గా నెంబర్ చూసుకుని డయల్ చేస్తే మంచిది."

రిసీవర్‌ని చప్పుడయ్యేలా ఫోన్‌పై పెట్టింది. మోములో చిరాకు, విసుగు తాండవం చేస్తుంది.

"ఎవరే!" అంది కిచెన్‌లోకి వస్తున్న వెన్నెలను ఓ వదిన.

"ఎవరో రాంగ్ నంబర్!" అని విసుక్కుంది.

తను చెయ్యబోయే పనిని ఫోన్ పరిసరాలలోకి మార్చుకుంది. భక్తి చేసే పనిపైన, చిత్తం మోగే ఫోన్ పైనలా ఉంది వెన్నెల వాలకం.

"ట్రింగ్... ట్రింగ్..."

చప్పున లేచి రిసీవర్ ఎవరైనా అందుకునే లోపే గబుక్కున వెన్నెలందుకుంది.

"హలో!" అంది కాస్త కంగారుగా. మాటకన్న శ్వాసశబ్దమే ఎక్కువగా వినబడుతోంది.

"ఆc! నేను వెన్నెలా!" అన్నాడు అవతలి వైపు నుండి చందు నవ్వుతూ. కాస్త భయంతో చుట్టుపక్కల కలయజూసింది. ఎవరూ లేరని నిర్ధారించుకుని తగ్గు స్వరంతో

"ఫోన్ ఎప్పుడు చేస్తానన్నారు! ఎప్పుడు చేశారు. టైం ఎంతవుతుందో చూడండి! ఎనిమిదిన్నర!" అంది ఎదురుగా ఉన్న వాచ్ వంక చూస్తూ.

"సారీ డార్లింగ్!"

"నేను రెండు గంటలు లేటుగా ఫోన్ చేస్తేనే అలకలు పోతున్నావు. నన్ను పూర్తిగా చూడకుండా ఉండగలవా!"

"ఏంటండీ ఆ పిచ్చిమాటలు. మరోసారి అలా మాట్లాడితే నామీదొట్టే!" అంది చిరుకోపంగా.

"ఓకే... ఓకే... అన్నట్లు మీ అమ్మానాన్నొచ్చారా!" అన్నాడు టాపిక్ మారుస్తూ.

"ఇప్పటివరకూ అయితే రాలేదు. ఈ రోజు ఉదయాన్నే చేరుకుంటామని బయలుదేరేముం[...] చేశారు."

"అన్నట్టు వెన్నెలా! నీక[...] పండగ గిఫ్ట్ తెస్తున్నాను!" అన్నాడు చందు. స్వరంలో కాస్త గర్వాన్ని కలబోస్తూ.

"ఏంటండదీ!" అంది కుతుహలంగా.

"వచ్చాక చెబుతానుగా! అందాక సస్పెన్స్..." అన్నాడు వెన్నెలను ఉడికించేట్టుగా.

"ప్లీజ్ చెప్పండీ! టెన్షన్‌గా ఉంది! చెప్పకపోయావో... ఈ ఫోన్ కట్ చేస్తాను" అంది బేతాళుని బెదిరింపులా.

"నోనో! నీకు చూపెట్టి థ్రిల్ చేద్దామనుకున్నాను.. చెప్పేస్తున్నాను... చెప్పేస్తున్నాను... నీకోసం పాట్నీ సెంటర్‌కెళ్లి శారీ కొన్నాను. అది నీలాగే అందంగా కనిపించింది. పాలమీగడలాంటి ఆవైట్ శారీపై అక్కడక్కడ రోజా పువ్వుల డిజైన్ వండర్‌ఫుల్‌గా ఉంది. ఆ చీర పేరెంటో తెలుసా!"

"ఏంపేరు!" అంది ఆసక్తిగా

"వెన్నెల!" ఆ చీర పేరు మీద నీపేరే అందంగా రాసి ఉంది. అందుకే కొన్నాను."

"నువ్వుచెబుతుంటేనే, చూడాలనిపిస్తుంది. సరే! తొందరగా వచ్చేయండి..." అంది వెన్నెల బేలగా

"వెన్నెలా! ఎదురు చూపులు ఎంతో తియ్యనైనవి తెలుసా! ఎదురు చూసే వ్యక్తి పట్ల ఉన్న ప్రేమను పదింతలు చేస్తాయి"

"త్వరగా వచ్చేయండి"

* * *

మూడు నెలల క్రితం చందు పెద్దక్క రాధ వాళ్లు రాజమండ్రిలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఒకరోజు ముందుగా వెళ్లారు. రాధ భర్త రఘు, చందుని పిలిచి మధ్యాహ్నం ట్రెయిన్‌కి తన బాబాయి, పిన్ని తొలిసారిగా ఇక్కడికి వస్తున్నారని, అందుకని స్టేషన్‌కెళ్లి వాళ్లని రిసీవ్ చేసుకురమ్మని రిక్వెస్ట్ చేశాడు. ఎప్పుడో చిన్నప్పుడు అక్కపెళ్లిలో చూసిన వారిని గుర్తు పట్టటం కష్టమనడంతో, తన కొడుకు బాబిగాడ్నిచ్చి స్టేషన్‌కు పంపించాడు. రావాల్సిన ట్రెయిన్ గంటలేటని అనౌన్సర్ మైకు తనదైన శైలిలో చెబుతుంటే విసుగుతో ఉన్న చందుకు చిర్రెత్తుకొచ్చింది. ఆ వచ్చే వాళ్లు ఆటోవాడికి అడ్రస్ చూపెడితే సరాసరి ఇల్లు చేర్చుతారు గదా! ఈయనగారొకడు! వచ్చీ రాగానే ఈ పని అప్పజెప్పాడని చందుకి బావమీద పీకలదాక కోపం వచ్చింది. బుక్‌స్టాల్‌లో ఓ పేపర్, బాబిగాడికి చిప్స్ పాకెట్ కొనిచ్చి సిమెంట్ బెంచ్‌పై కూలబడి చదవటంలో నిమగ్నుడయ్యాడు. వచ్చేస్తున్నానంటూ, ముందుగా తన కూతతో తెలియపరుస్తూ ప్లాట్‌ఫామ్‌పై వచ్చి ఆగింది రైలు. ఓ

...మంట్ డోరు దాటుతుండగా, ఓ ...మ్మాయి సడన్‌గా చందు ముందు ...గింది. అనుకోకుండా దిగిన ఆమెను చూసి తాకకుండా తన బ్యాలెన్స్ కంట్రోల్ చేయప్రయత్నించాడు. అయినా తగిలీ తగలకుండా భుజాలు తగిలాయి. యాదృచ్ఛికంగా ఈ ఘటన క్షణాలలో జరిగింది. చందు గుండె వేగంగా కొట్టుకోనారంభించింది.

"ఐయామ్ సారీ! నేను కావాలని మిమ్మల్ని..." అన్నాడు నసుగుతూ ముఖానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

"ఇట్స్ఓకే!" అందామ్మాయి.

ఎ ా వ ం మ య ్ య బతికిపోయాననుకొని ఊపిరిని గుండెనిండా హాయిగా పీల్చుకుని నడవ సాగాడు. ఇందాక టెన్షన్‌లో ఉండి ఆమె మోము సరిగా చూడలేదు. ఓసారి చూస్తే పోలా! అనుకుని వెను తిరిగి చూశాడు. పాలసంద్రం నుండి ప్రభవించిన చందమామలా ఉందా మోము. అనుకోకుండా ఆమె చూపును చందువైపు మరల్చింది. గిరుక్కున తలతిప్పి చూపుని ముందుకు మరల్చి ఎదురుచూశాడు. బాబిగాడు చకచక నడుచుకుంటూ వస్తున్నాడు.

''అదిగో నాన్నమ్మా!'' అంటూ పరిగెత్తి దూరంగా నిల్చున్న ఓ ఆవిడ్ని హత్తుకున్నాడు బాబిగాడు. వాడిని అనుసరించి ఆవిడ ముందు మౌనంగా నిల్చున్నాడు.

"మావయ్యా! ఇక పోదామా" అన్నాడు బాబిగాడు చందువైపు చూస్తూ.

ఎదురుగా ఉన్న చందుని చూసి "ఎవరు బాబూ నువ్వు!" అందావిడ కళ్లజోడు సరి చేసుకుంటూ.

"నన్ను గుర్తు పట్టలేదా ఆంటీ!" అన్నాడు చందు నవ్వుతూ.

ఆవిడ గుర్తు పట్టేందుకు ప్రయత్నిస్తోంది.

"నేను రాధ తమ్ముణ్ణి ఆంటీ!" అన్నాడు తనకు తానే పరిచయం చేసుకుంటూ. ఆవిడ ముడిచిన భృకుటి విడిచి. "ఏదీ మా రఘు బావమరిదివా! వాడి పెళ్లిలో ఇంత ఉండేవాడివి. ఎంత ఎదిగిపోయావు." అంది నవ్వుతూ.

చిన్నప్పుడు అంత ఉండకపోతే ఇంత ఉంటారా! మీ పిచ్చిగాకపోతేనూ! అనాలని ఉన్నా పైకి అనలేకపోయాడు.

"అంకుల్ ఎక్కడాంటీ!"

"రాలేదు బాబూ! వచ్చేవాడే కాని, తీరా బయలుదేరే ముందు అర్జంటు పని తగిలి రాలేకపోయాడు."

"ఇక వెళదామా ఆంటీ!" అని సూట్‌కేసు, బ్యాగు చేతబూనాడు చందు.

"కాసేపాగు బాబూ!" అంటూ ఓ దిక్కుగా చూస్తోంది.

"ఎవరికోసం చూస్తున్నావు ఆంటీ!"

"మా అమ్మాయి కోసం. నీళ్లు తాగడానికెళ్ళింది" అంది కూతురు వెళ్ళిన వైపు చూస్తూ. చందు ఎదురుగా చూశాడు. అదే అమ్మాయి.. అవును అదే అమ్మాయి ఇందాక మెరుపు తీగలా కనిపించి మాయమైంది. నేరుగా చందు ఎదురుగా వచ్చి నిల్చుంది. కలయా! నిజమా! ఏమో! ఊహల్లో తేలిపోతున్నాడు. ఇంతలో "మమ్మీ వెళదామా!" అంది.

ఆ మాట విని షాక్ తిన్నట్టుగా అనిపించింది చందుకు. మౌనంగా ఆమె వైపు చూస్తున్నాడు. అమాయకంగా ఏదీ అర్థం కానట్లు.

''వెన్నెలా ! ఇతన్ని గుర్తుపట్టావా!" అందావిడ.

"వెన్నెల! వాటే బ్యూటీఫుల్ నేమ్. ఆమె రూపానికి తగ్గట్టుగానే ఉంది" అని మనసులో అనుకున్నాడు. వెన్నెల కళ్లను అటూఇటూ తిప్పుతూ ఆలోచించి,

"ఛ్చ... ఊహుఁ ఏమో మమ్మీ గుర్తుకు రావడం లేదు" అంది వెన్నెల.

"మీ ఒదిన తమ్ముడు.

"హలో! ఐయామ్ చందు!" అన్నాడు.

"ఐయామ్ వెన్నెల!" అంది అరనవ్వుతో.

స్టేషన్ బయటికొచ్చి స్టీరింగ్ ఆటో మాట్లాడి, వెళ్ళాల్సిన అడ్రస్ డ్రైవర్‌కు చెప్పి పక్కన కూర్చున్నాడు చందు. వెనకసీట్లో ఆ ముగ్గురు కూర్చున్నారు.

"ఇక్కడే... ఇక్కడే... ఆపు... ఆపు...." రెట్టింపుగా అరిచాడు బాబిగాడు.

వెన్నెలని మిర్రర్‌లో చూస్తున్న చందు వాడి అరుపుకు ఉలిక్కిపడి.

"అప్పుడే ఇల్లొచ్చేసిందా!" అని లోలోన విసుక్కుని దిగాడు. ఒకటి, రెండు రోజుల్లోనే చందు, వెన్నెల మధ్య చనువు బాగా పెరిగింది. తల్లిదండ్రులు వెళ్ళినా చందు మాత్రం వెళ్ళలేదు. అక్కడే ఉన్న వెన్నెల కోసం ఉండిపోయాడు.

* * *

దైవదర్శనం చేసుకుని మంటపం స్తంభానికి చేరగిలపడి ఆలోచనల్లో పడ్డాడు. వెన్నెల తొలిచూపులోనే నా మనసును దోచేసింది. ఈ వారం రోజుల పరిచయంలో ఆమె మనస్తత్వం పూర్తిగా తెలిసిపోయింది. బాహ్య సౌందర్యమే కాదు. అంతర్ సౌందర్యం కూడా బాగా నచ్చేసింది. నిజంగా సుగుణాల రాశి వెన్నెల! పెళ్లంటూ చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే చేసుకోవాలి. ఇలాటి ఏమిటి! ఈమెనే చేసుకోవాలి. నాకు నేనుగా అనుకుంటే సరిపోతుందా!

ఆమెకు మాత్రం నేను నచ్చొద్దా! నచ్చాలి. నచ్చాలంటే నా మీద ఆమెకు ఎలాంటి అభిప్రాయం ఉందో తెలుసుకోవాలి. నా గురించి ఇన్‌డైరెక్ట్‌గా కదిపి చూడాలి అని మనసులో అనుకున్నాడు. ముఖద్వారం వైపు చూశాడు. ఎదురుగా ఆమె. "వెన్నెలా! నువ్విక్కడా! ఎప్పుడొచ్చావు!" అన్నాడు ఆశ్చర్యాన్ని కలబోసి.

"ఇందాకే వచ్చాను. నువ్వప్పుడు ధ్యానంలో ఉన్నావు. నాకు చెప్పకుండా వచ్చేశావు. చెబితే ఇద్దరం కలిసి వచ్చే వాళ్లం కదా!" అంటూ ఎదురుగా కూర్చొంది.

తనకీ ఆలోచన రానందుకు లోలోన తిట్టుకున్నాడు.

కొద్దిసేపు మౌనంగా ఉన్న చందు "వెన్నెలా! నీకొక విషయం చెబుదామనుకుంటున్నాను. అది నువ్వు విని కోప్పడనంటేనే!"

"నువ్వు చెబితే కదా! కోప్పడేది కోప్పడందీ తెలిసేది. సరే, కోప్పడనని హామీ ఇస్తున్నాను. చెప్పు" అంది నవ్వుతూ. అతడు ఆలోచించసాగాడు.

'హలో' అని చందు ముఖం ముందర గాలిలో చిటికేసింది వెన్నెల. ఉలిక్కిపడి ఆలోచనల నుండి తేరుకున్నాడు.

"ఏదో చెబుతానన్నావు!" అంది ఆసక్తిగా. చందు వణుకుతున్న పెదవులతో. "నాకు... నాకు ఇప్పటిదాకా పెళ్లంటే ఇంట్రస్ట్ లేదు. ఈ మధ్య దాని మీదకి ధ్యాస మరలి ఇంటరెస్ట్ కలిగింది. అలా కలడానికి కారణం. కారణం "అర్ధోక్తిగా ఆపేశాడు తడబడుతూ. ముఖానికి పట్టిన చెమటలను రూములుతో తుడుచుకున్నాడు.

"ఎవరు చందూ"

"నువ్వే వెన్నెలా!" రక్కున అని కిమ్మనకుండా మరోవైపు తిరిగి నిల్చున్నాడు. మెట్లు దిగుతున్న వెన్నెల నిశ్చేష్టురాలై స్థాణువులా మారి శూన్యంలోకి చూస్తోంది.

"ఐయామ్ సారీ వెన్నెలా! నిన్ను బాధపెట్టానన్పిస్తుంది. అందుకు మరోసారి క్షమించు. ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటారు కదా! అలాగే నువ్వు తొలిచూపులోనే నాకు నచ్చావు. వెన్నెలా! ఈ రోజు మొత్తం ఆలోచించుకో!" అన్నాడు చందు. అక్కడ నుండి గబగబా ముభావంగా వెళ్లిపోతున్న వెన్నెలనుద్దేశించి చందు "వెన్నెలా! నేను నీకు నచ్చితే, రేపు ఉదయం మా అక్క ఇంటి ముందర రోజా పువ్వు ముగ్గు వెయ్యి" వినబడేలా గట్టిగా అన్నాడు.

* * *

సమయం 12 గంటలు. రావాల్సిన చందుకోసం ఎదురు చూస్తూ తినకుండా టీవీలో వస్తున్న ఫెస్టివల్ స్పెషల్ చూస్తూ ఆనందిస్తున్నారు.

ట్రింగ్... ట్రింగ్.. ట్రింగ్.. టీవీలోని ఓ జోక్‌కు నవ్వుతున్న సుబ్బారావు ఫోన్ చప్పుడు విని లేచి అందుకున్నాడు.

'హలో!' అన్నాడు నవ్వుతూ తిరిగి.

"ఆఁ ఇదే చెప్పండి! ఆఁ మావాడే... ఏంటీ?" అన్నాడు ఆశ్చర్యంగా అవతలి వారు చెప్పిన మాటలు విని గుండెలో బాంబు పేలినట్టయ్యింది. ముఖంలోని భావాలన్నీ ఒక్క క్షణంలో మారిపోయి పాలిపోయింది. కంగారు పడుతూ, వణుకుతున్న చేతులతో ముఖానికి పడుతున్న చెమటను పదే పదే కండువాతో తుడుచుకుంటూ వింటున్నాడు. కళ్లనిండా నీళ్లు "ఎప్పుడు? ఎక్కడ?" అడిగాడు. మాటపెగలక తడారిన గొంతుతో మెల్లిగా తిరిగి చూశాడు. టీవీ చూస్తున్న వారు.... తనవైపు ఎవరూ చూడటం లేదని ఆర్ద్రతతో, "ఏ హాస్పిటల్లో! ఇప్పుడే బయలుదేరుతున్నాం" ఫోన్ మెల్లిగా పెట్టేసి సోఫాలో కుప్పకూలిపోయి శూన్యంలోకి పిచ్చి చూపులు చూస్తున్నాడు. వెల్లువలా ముంచుకొస్తున్న దుఃఖాన్ని అతికష్టమ్మీద దిగమింగుకున్నాడు. లేచి భారంగా అడుగులేస్తున్న భర్త ముఖంలో దిగులు కనిపెట్టి "ఎవరండీ ? ఇందాక ఫోన్ చేసింది. చందుయేనా! రావడానికి ఆలస్యం అవుతుందన్నాడా! నీకోసం తినకుండా ఎదురు చూస్తున్నామని నాలుగు చీవాట్లు పెట్టాల్సింది" అంది అన్నపూర్ణ ఎదురుపడి. చందుకు యాక్సిడెంట్ అయిన విషయం ఇప్పుడే తెలిస్తే బావుండదనుకున్నాడు. దుఃఖంతో గొంతు పూడుకుపోయి మాటపెగలక "అది... అది... ఆఁ... నా ఫ్రెండ్ రామారావుకు వంట్లో బాలేదంటా! హాస్పిటల్‌లో చేర్పించారట! అన్నాడు తడబడుతూ గద్గద స్వరంతో. టీవీ చూస్తున్న అల్లుళ్ళ దగ్గరకెళ్లి, "బాబూ ఇలా వస్తారా?" అన్నాడు చెమర్చిన కళ్ళతో. సోఫాలో కూర్చున్న వారు మామగారి వెంట బయటికి దారి తీశారు. అలా వెళ్ళిన వారు సాయంత్రం నాలుగు గంటల వరకూరాలేదు. ఉదయం ఉన్న సందడి మాయమై స్తబ్దతతో ఉందా ఇల్లు. రావాల్సిన చందు ఎందుకు రాలేదో తెలియక, బయటికి వెళ్ళిన వారు ఎందుకు వెళ్ళారో తెలియక బిక్కుబిక్కుమంటూ ఫోన్ దగ్గర దిగులుతో మౌనంగా కూర్చున్నారు. అలా కూర్చున్నవారి మనసులు పలు విధాలుగా కీడును శంకిస్తున్నాయి. ఆరు బయట వ్యాను ఆగిన చప్పుడు విని గబగబా అందరూ ఇవతలి కొచ్చారు. వారి ముఖాలు నిర్లిప్తంగా, నిస్తేజంగా ఉన్నాయి. చివరగా చందు దిగాడు. అది కూడ హాస్పిటల్ బెడ్‌మీద నిర్జీవంగా, నిస్ప్రాణంగా శాశ్వత నిద్రపోతున్నాడు. పక్కన 'చందు'రుని వీలువైన 'వెన్నెల'కోసంఇష్టపడి కొన్న వెన్నెలచీర. శ్వేత వర్ణాల ఆ చీర, కొన్న యజమానితో పాటే దిగింది. ★

చైనా దృశ్యం

చైనా గురించిన విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం నాకు చాలా ఎక్కువ. ఎంత చదివినా ఇంకా చదవాలనిపిస్తుంది. ఆ ఉత్సాహంతోనే డాక్టర్ వై.రాధా కృష్ణమూర్తి రాసిన చైనా డైరీ (పర్యటనా కథనం) పుస్తకం కూడా చదివాను. అంతకుముందు చైనా అభివృద్ధిని గురించిన వార్తలు, వ్యాసాలు, గణాంకాలు చాలా చదివాను, ప్రసంగాలూ విన్నాను. 60 పేజీల పుస్తకంలో ఏడు రోజుల పర్యటన వివరాలు మాత్రమే ఉన్నాయి. కానీ పుస్తకం తీసుకున్న తరువాత ఆపకుండా ఆసాంతం చదివాను. పుస్తకం చదువుతున్నామనే భావన కాక ఆ పర్యటనలో మనం భాగమనే అనుభూతి కల్గింది. మనం డైరీ ఎలా రాసుకుంటామో అలానే ఏడు రోజుల పర్యటనను ఏడు రోజుల తేదీల శీర్షికలతో అందించారు. వీటికి ముందు పర్యటన పూర్వాపరాలను వివరించారు. తరువాత పర్యటనపై తన అభిప్రాయాలను చెప్పారు. రచయిత ఏడు రోజుల దినచర్య పుస్తకంలో కనబడుతుంది. ఆ దినచర్యలో భాగంగానే ఆ పర్యటన సభ్యుల మధ్య విధాన పరమైన చర్చలు, చైనా అధికారులతో చర్చలు, చూసిన ప్రదేశాల వివరాలు, స్థానిక పత్రికల్లో వచ్చిన వార్తలు, బోలెడు గణాంకాలు... సాఫీగా సాగే పఠనంలో అంతర్లీనంగానే ఆ వివరాలు, ఆ విషయాలు పాఠకుని మస్తిష్కంలోకి వెళతాయి. ఒక సీరియస్ పుస్తకాన్ని చదువుతున్నామనే భావన పాఠకుడికి రాదు... కానీ అందులో ఉంది సీరియస్ అంశాలే. పుస్తక రచనలో తీసుకున్న ఈ మెళకువే పాఠకుని హృదయాన్ని హత్తుకునేలా చేసింది. తాను చూసినంతవరకు, చర్చించినంతవరకు చైనాలో ఏమి జరుగుతుందో ఉన్నది ఉన్నట్లు పుస్తకంలో ఇచ్చారు. "మాది అధ్యయన పర్యటన కాదు. కేవలం వినోద పర్యటనా కాదు. చైనా ప్రభుత్వ ఆహ్వానంపై వారి అతిథ్యంలో వెళ్లిన స్నేహపూర్వక పర్యటన. కొన్ని పరిమితులకు లోబడే పర్యటన జరిగింది. పర్యటన పూర్తిగా మహానగరాలకే పరిమితం కావడం వలన గ్రామీణ ప్రాంతాన్ని చూడటం, ఆ జీవితాన్ని స్థూలంగానైనా అవగాహన చేసుకోవడం సాధ్యం కాలేదు. ప్రభుత్వ, పార్టీ, ప్రాంతీయ సంస్థల అధికారులతో చర్చలు జరపగలిగాం. సాధారణ ప్రజలతో మాట్లాడేందుకు భాష పెద్ద అవరోధం. ప్రోగ్రాం చాలా బిగుతుగా ఉండడం వల్ల సమయం కూడా చాలా తక్కువ. ఈ పరిమితులకు లోబడే మేము ప్రత్యక్షంగా చూసింది, చర్చల్లో సేకరించిన సమాచారం, మా పాత్రికేయ మిత్రులు సేకరించిన కొన్ని గణాంక వివరాలు యథాతథంగా ఇవ్వడానికి మాత్రమే ప్రయత్నించాను'' అని రచయిత తమకున్న పరిమితులను వివరించారు. కానీ పుస్తకాన్ని కాస్త పరిశీలనగా చదివితే జనచైనా సాధించిన మిరిమిట్లు గొలిపే అభివృద్ధి కనిపిస్తుంది. మన దేశ రాజధాని ఢిల్లీ, చైనా రాజధాని బీజింగ్ మధ్య పోలికే పెద్ద ఉదాహరణ. " ఢిల్లీ వైశాల్యం 685 చ.కి.మీ. బీజింగ్ 750 చ.కి.మీ., ఢిల్లీకి రెండు రింగ్ రోడ్లు. బీజింగ్‌కు చాలా నీట్‌గా ఉన్న నాలుగు 200 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వేలు. ఢిల్లీ సబ్‌వే 2008 నాటికి 16 కి.మీ. నిడివికి వస్తుంది. బీజింగ్‌కు యిప్పటికే 54 కి.మీ. పదేళ్లకు 150 కి.మీ వస్తుంది. ఢిల్లీలో మూడవ వంతు జనాభా నివసించే మురికి వాడలున్నాయి. బీజింగ్‌లో లేవు. బీజింగ్ మున్సిపాలిటీ 80 శాతం గార్బేజ్‌ని 49 శాతం సీవేజ్‌ని శుభ్రపరుస్తూ వుంది. ఢిల్లీలో అది 37 శాతంగా ఉంది." పర్యటనలో భాగంగా రచయిత తిరిగిన వివిధ ప్రదేశాల వివరాలు చెబుతుంటే అందులోనే అంతర్లీనంగా మనకు ఆ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి కనిపిస్తుంది. చైనా అధికారులతో జరిగిన చర్చల్లో మన దేశంతో వారు స్నేహ సంబంధాలను కోరుతున్నట్లు తెలుస్తుంది. మన ఆర్థిక పరిస్థితి, పార్లమెంటరీ వ్యవస్థను కూడా తెలుసుకోవాలనే ఉత్సాహం కనిపిస్తుంది. మన దేశంతో విద్యా సంబంధాలను కూడా పెట్టుకోవాలనే ఆకాంక్ష తెలుస్తుంది. మన దేశంలో వామపక్ష ఉద్యమ వివరాలను కూడా అడిగి తెలుసుకుంటారు. డబ్ల్యుటివోలో చేరడానికి కారణం, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను మార్కెట్ ఆర్థిక వ్యవస్థతో ఎలా అనుసంధానం చేయగలుగుతున్నారనేది పర్యటన సభ్యుల నుండి చైనా అధికారులకు ఎదురైన ప్రశ్నలు. దానికి వారి సమాధానం "మా పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేసుకుంటూ వస్తున్నాం. కానీ మా మౌలిక ధ్యేయమైన సోషలిస్టు నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటున్నాము. ఆ బాటలో కొన్ని ఇబ్బందులున్న మాట వాస్తవం. వాటిని అధ్యయనం చేస్తున్నాం. అధిగమించే ప్రయత్నమూ సాగుతున్నది. ప్రజానీకం యొక్క తక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సోషలిస్ట్ ప్రాక్టీస్‌ను తగినంతగా మోడిఫై చేసుకోవలసి ఉంటుంది". అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక పత్రికల్లో వచ్చిన వార్తల కటింగ్‌లను కూడా ఇచ్చారు. ప్రధానంగా రైతాంగం ఎక్కువ సమస్య ఎదుర్కొన్నట్లు కనిపిస్తుంది. చైనా అధికారులతో జరిగిన చర్చల్లో వారూ ఈ విషయాన్ని అంగీకరించినట్లు తెలుస్తుంది. "వ్యవసాయ రంగం మాకు ఆందోళన కల్గిస్తున్నది. ఉత్పత్తి గణనీయంగా ఉంది. కాని సాంకేతికత ఇంకా పూర్తి స్థాయికి చేరుకోనందున, నాణ్యతలో లోపం ఎగుమతులకు అవరోధంగా ఉంది". విధాన పరమైన చర్చలతో పాటు చైనీయుల మర్యాద, వారి పద్ధతులు, వారి సమయపాలన వంటి వివరాలు అంతర్లీనంగా ఈ పుస్తకంలో కనిపిస్తాయి. రచయిత ముందుగానే చెప్పినట్లు కొన్ని పరిమితులకు లోబడి సేకరించిన సమాచారం ఆధారంగానే పుస్తకం రాశారు. చైనా గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఆ సమాచారం చాలా విలువైందే. చైనా అభివృద్ధిలోని ఇబ్బందులు కూడా తెలిపారు. పుస్తకం రాసిన తీరు కారణంగా చదువుతూ ఉంటే వైఆర్‌కె ఉపన్యాసమంత సాఫీగా సాగుతూఉంటుంది.

- గమిడి శ్రీనివాస్

చైనా డైరీ
రచన : డాక్టర్ వై.రాధాకృష్ణమూర్తి,
వెల : రూ. 6/-, **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

స్వీకారం

ఈ పుస్తకంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి వివిధ సందర్భాల్లో ఆంగ్లంలో చేసిన ప్రసంగాలను చేర్చారు. ఇందులో కొన్ని ఇంటర్వ్యూలు కూడా వున్నాయి.

దట్స్ వాట్ ఐ సెడ్
రచన : డాక్టర్ సి.నారాయణరెడ్డి,
ఎడిటర్ : డాక్టర్ భార్గవి పి.రావు, **వెల:**రూ. 200/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, బుక్‌లింక్స్ కార్పొరేషన్, హైదరాబాద్



ఎందరో రాజకీయ నాయకులకు, మేధావులకు, కళాకారులకు, క్రీడాకారులకు పుట్టినిల్లయిన అమృతలూరు గ్రామ పరిణామ దశలను ఇందులో వివరించారు. అమృతలూరు లలిత కళలకు సంగీత సాహిత్యాది కళలకు నాటి నుండి అగ్రస్థానంలో ఉన్నట్లు ఈ పుస్తకాన్ని బట్టి తెలుస్తోంది. ఎందరో శిల్పులు, నాట్య కళాకారులు కూడా ఈ గ్రామానికి చెందిన వారున్నట్లు ఇందులో తెలిపారు.

అమృతలూరు అమృత చరిత
రచన : పరుచూరి రంగారావు
పరిష్కర్త : మైనేని నారాయణమూర్తి,
వెల:రూ. 100/-; **ప్రతులకు :** మైనేని నారాయణమూర్తి, వివేక్ ఎంటర్‌ప్రైజెస్, ఫ్లాట్ నెం. 6, ఇందిరానగర్ కాలనీ, సుష్మాథియేటర్ ఎదురుగా వనస్థలిపురం, హైదరాబాద్ - 70

ఫిబ్రవరి 27 2002 నుండి గుజరాత్‌లో జరిగిన మత హింస గురించి ఇందులో వివరించారు. మత హింసలో 850 మంది చనిపోయారని ప్రభుత్వం గుర్తించింది. వారిలో ఎక్కువ మంది ముస్లిమ్‌లు. అయితే చనిపోయిన వారి సంఖ్య రెండు వేలకు పైగానే ఉంటుందని అనధికార అంచనా.

మిమ్మల్ని రక్షించడానికి మాకు ఆదేశాల్లేవు
రచన: స్మితా నరూలా **తెలుగు:** కలేకూరి ప్రసాదు,
వెల:రూ. 20/-; **ప్రతులకు :** దళిత్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్, ఇ.నెం. 1-3-183/40/46/11, 12, ఫస్ట్‌ఫ్లోర్, సాయినగర్ కాలనీ, న్యూబాకారం, గాంధీనగర్, హైదరాబాద్ - 80, ప్రజాశక్తి, నవోదయ, దిశ, మైత్రీ బుక్‌హౌస్‌లు